క్లుప్తంగా

నేడు కారెంపూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) గురువారం కారెంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి బుధవారం సాయంత్రం తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఇంటింటికీ పర్యటిస్తారని పేర్కొన్నారు.

విష జ్వరాలపై ప్రజలకు అవగాహన తప్పనిసరి

రెంటచింతల: వర్షాకాలంలో ప్రబలే మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నర్రా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు, మలేరియ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి క్షణం అప్రమత్తం



రెంటచింతల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాతకాలం నాటి మట్టి మిద్దె గోడలు నాని పడిపోయే ప్రమాదం ఉందన్నారు. వర్షం కురుస్తూ ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లవద్దని సూచించారు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కరిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. పొంగుతున్న వాగులు, కుంటల వద్దకు పిల్లలను వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. పొలాల్లో మోటార్లు ఆన్‌చేసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీఆర్వోలకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పిడుగురాళ్ల: పట్టణంలోని సాయి వృద్ధాశ్రమంలో జర్నలిస్టుల ఉత్యమనేత అంబటి ఆంజనేయులు సంస్మరణ సభ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు ఎంతోమంది జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రమేష్, అధ్యక్షుడు రామిశెట్టి మధుసూదన్‌రావు, సెక్రటరీ ఎస్కే బాషా, కోశాధికారి మణికంఠ, జి.పేరయ్య, డి. రామారావు, జి. నరసింహారావు, నాగేంద్రం, బాబురావు, రాఘవ, రవీంద్ర, ఆంజనేయులు, శేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళాశాల స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించాలి



పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని అక్రమణల నుంచి కాపాడాలని తహసీల్దారు చక్రవర్తికి ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కళాశాల స్థలాన్ని కొంతమంది అక్రమించుకుంటున్నారని, కాపాడాలని కోరారు. కళాశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఏఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ బిలాల్, సాయి, మధు, రాజు ఉన్నారు.

ముస్లిం శ్మశానవాటిక ఆధునీకరణ



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో ముస్లిం శ్మశాన వాటిక ఆధునీకరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.15లక్షల నిధులు మంజూరయ్యాయి. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి పనులను ప్రారంభించారు. ముస్లిం మైనార్టీల కోసం ఈద్గా నిర్మాణం కూడా చేపడుతున్నామని చైర్మన్ సుబ్బమ్మ చెప్పారు. పార్టీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, వార్డు ఇన్‌చార్జి ఎం.వెంకటేశ్వర్లు, యార్డు చైర్మన్ బుగ్గల జానీ, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తుకు పరిష్కారం

- 'జగనన్న సురక్ష'తో వేగంగా ధృవపత్రాల జారీ..
- సంతోషం వ్యక్తం చేస్తున్న అర్జీదారులు

కారెంపూడి: చినకొదమగుండ్ల గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆర్డీఓ అద్దెయ్య పర్యవేక్షించారు. మొత్తం 89 అర్జీలు రాగా వాటిలో 85 అర్జీలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. వెంటనే దరఖాస్తుదారులకు ధృవపత్రాలు అందజేశారు. మిగిలిన సమస్యలను కూడా పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. కిల్లేటి అల్లాజీ తనకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. తన తండ్రి మృతి చెందడంతో ఆయన పేరుతో ఉన్న పొలానికి తనకు వారసత్వ హక్కును కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే షేక్ మీరాబీ కూడా తన భర్త ఖాదర్‌కు సదరన్ సర్టిఫికెట్ గ్రామ సభలో అందించారని, దివ్యాంగుల పింఛన్ మంజూరుకు అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వృద్ధులమైన తమకు జగనన్న కొండంత భరోసా కల్పించారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ సభలో గ్రామ సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెట్టిపాలెంలో 'జగనన్న సురక్ష'

రెంటచింతల: జెట్టిపాలెం గ్రామంలో సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్ అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి పాల్గొన్నారు. వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు 129మందికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, ఉప సర్పంచ్ కుందురు అనంత లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు తదితరులుపాల్గొన్నారు.

పిడుగురాళ్ల 13వ వార్డులో..

పిడుగురాళ్ల: మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పట్టణంలోని 13వ వార్డు సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ధృవ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పనిలేదని, వలంటీర్‌కు దరఖాస్తు ఫాంను ఇస్తే, అర్హులైతే వారికి సర్టిఫికెట్ ఇంటికొచ్చి ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, కౌన్సిలర్లు అన్నెం పద్మావతి బంగారురెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అండగా 'జగనన్న సురక్ష'

మాచర్ల: మాచర్ల పట్టణంలోని పూర్ణయ్య షెడ్డు ప్రాంతంలో బుధవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. 44 మంది అర్హత కలిగిన వారికి ధృవీకరణ పత్రాలు, వివిధ పత్రాలను అందజేశారు. తొమ్మిది స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సేవలందిస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు మాచర్ల చిన ఏసోబు, మాచర్ల సుందరరావు, కో-ఆప్షన్ మెంబర్ ఎ.అనంతరావమ్మ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

దాచేపల్లి: గామాలపాడు, పొందుగల గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపును బుధవారం నిర్వహించారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. జెడ్పీటీసీలు జంగా వెంకటకోటయ్య, మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు తండా అబ్దుల్‌సత్తార్, కందుల జాను, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, తహసీల్దార్ టి. ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో శోభారాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం 2 నందు బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, కౌన్సిలర్‌లు కుక్కమూడి అనిల్‌కుమార్, కత్తి రమాదేవి రవికుమార్, బండి రవికుమార్, కె.కళ్యాణ్, కో-ఆప్షన్ డీజే నారాయణ, నగర పంచాయతి కమీషన్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకే 'జగనన్న సురక్ష'

గురజాల: సాంకేతిక సమస్యల కారణంగా మిగిలిపోయిన ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆర్డీవో కె.అద్దెయ్య అన్నారు. చర్లగుడిపాడు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారులకు ధృవీకరణ పత్రాలు అందించారు. వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, డీఎల్‌డీవో గబ్రూనాయక్, తహసీల్దార్ మీసాల దానియేలు, ఎంపీడీవో ఆర్.ఫణికుమార్ నాయక్, సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, గ్రామ సర్పంచ్ బత్తుల ప్రసాద్, బత్తుల తిమ్మరాజు, తదితరులున్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

దుర్గి: ఆత్మకూరు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. 75 ధృవపత్రాలను అర్జీదారులకు అందజేశారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ గ్రామంలో అర్హతున్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చటం జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. మండల కన్వీనర్ బొబ్బ సీతారాంరెడ్డి, ఎంపీడీఓ సమతావాణి, సర్పంచ్ నాగెండ్ల అనురాధ, ఎంపీటీసీ ఎలకపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కారెంపూడి: కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఆర్డీఓ అద్దెయ్య, ఎంపీపీ, జెడ్పీటీసీ



రెంటచింతల: సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్ పుల్లారావు



పిడుగురాళ్ల: సర్టిఫికెట్‌లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



మాచర్ల: సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కిషోర్, కమిషనర్



గురజాల: సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీవో



దుర్గి: సర్టిఫికెట్ ఇస్తున్న తహసీల్దార్ రమేష్

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

కారెంపూడి: మిరియాల గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. గంజర్ల హనుమంతరావు, మోరబోయిన కొండలు, మోరబోయిన గంగయ్య, మోరబోయిన గణేష్ కుటుంబ సభ్యులు ఆ గ్రామ నాయకులతో ఆధ్వర్యంలో మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేస్తున్న కృషి, పార్టీ కేడర్‌పై చూపిస్తున్న అభిమానానికి ఆకర్షితులమై..పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన గృహ సామగ్రి

కారెంపూడి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహం దగ్ధమైన ఘటన ఒప్పిచర్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మిద్దెపోగు యాకోబుకు ఇంటికి విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో పక్కనున్న ఇంటి నుంచి వైరు లాగి కరెంటు వాడుకుంటున్నారు. యాకోబు అతని భార్య ప్రభావతి ఇంట్లో లేని సమయంలో.. వారి కుమారుడు టీవీ స్విచ్ ఆన్ చేయడంతో ప్లగ్ నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. అవి ఇళ్లంతా వ్యాపించి సామానులన్నీ కాలిపోయాయి. బీరువాలో ఉన్న కొద్ది పాటి నగదు, డ్వాక్రా నగదు బ్యాంకులో చెల్లించడానికి సభ్యులిచ్చిన నగదు రూ.40 వేలు, స్పందన నగదు మరో రూ.40 వేలు కూడా అందులో ఉన్నాయని బాధితురాలు ప్రభావతి ఆవేదన వ్యక్తం చేసింది. ఇంట్లో బీరువా, టీవీ, ఇతర వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ రమణ కుమారుడు ఇరికెదిండ్ల లాజర్ పరామర్శించి, రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.



కాలిపోయిన ఇంట్లోని సామగ్రి

కనుల పండువల చర్చి వార్షికోత్సవం

దాచేపల్లి : కేసానుపల్లి గ్రామంలోని క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ట 3వ వార్షికోత్సవాలు బుధవారం కనుల పండువలా జరిగాయి. స్థానిక పాస్టర్ గనుపల్లి శ్యామ్యేలు ప్రసన్నకుమార్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెస్ట్ గుంటూరు సినడు బిషప్ రెవ. జంగాల ప్రభాకర్‌రావు పాల్గొని, వాక్య పరిచర్య చేశారు. ప్రతి ఒక్కరి హృదయం దేవునికి దేవాలయంగా మారాలని, మనిషి హృదయమనే దేవాలయంలో క్రీస్తు నివశించాలని బిసప్ ప్రభాకర్ రావు చెప్పారు. సినడు వైస్ ప్రెసిడెంట్ డేగల దేవానంద్, కౌన్సిల్ సభ్యుడు పి. క్రాంతికుమార్, సినడు నాయకులు గొట్టిముక్కల ఐజయ్య, ఏఈఎల్‌సీ వైస్ ప్రెసిడెంట్ ఆళ్లమూడి జేమ్స్, ఏఈఎల్‌సీ డేలిగేట్స్ వినుకొండ బాబు, పులిపాడు ఇస్సాక్, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, పాస్టర్లు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బిషప్ ప్రభాకర్‌రావు

వాసవి క్లబ్స్ సూర్యాస్తమ సేవలు స్ఫూర్తి

మాచర్ల: సేవే పరమావధిగా, సమాజ హితం కోసం సేవలందిస్తున్న వాసవి క్లబ్ కార్యక్రమాలలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని దంత వైద్యులు విడేల హరీష్ అన్నారు. బుధవారం వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ ప్రతి సంవత్సరం జులై నెలలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఉదయాస్తమ సేవా కార్యక్రమాలు మాచర్లలో జరిగాయి. వాసవి క్లబ్ అంతర్జాతీయ అధికారి ఎం శ్రీనివాసరావు, మామిడి శ్రీనివాసరావు, పసుమర్తి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి ఆదేశాల మేరకు జై జవాన్, జై కిసాన్ రైతు బంధు పేరిట రైతులకు ఎరువులు, పురుగుమందులు అందజేశారు. ,ధన, మాన, ప్రాణ, దేశ రక్షణలో అహర్నిశలు పనిచేసిన మాజీ సైనికులను రక్షక మిత్ర పేరుతో సత్కరించారు. స్థానిక వాసవి వృద్ధాశ్రమ నిర్వాహకులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. జమ్మలమడక రహదారిలో రెండు సిమెంట్ బల్లలు, 25 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రీజియన్ చైర్మన్ వెల్లంపల్లి కేశవరావు, అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, మేడా వెంకట లక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, బచ్చు రాజ్‌కుమార్, చుండూరు సత్యనారయణ, బొగ్గవరపు సామ్రాజ్యం, పరిటాల ధనలక్ష్మి, నిడమనూరి లక్ష్మీ ప్రమీల, కొప్పురావూరి నీరజ, రంగా చెన్నయ్య తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాసరావు

ఐసీడీఎస్‌ను పరిరక్షించాలి..

సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి

సత్తెనపల్లి: సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసీడీఎస్‌ను పరిరక్షించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం పుతుంబాక భవన్లో జరిగిన సంఘం జిల్లా విస్తృత సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా ఈ నెల 10 , 11వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ఎస్ అహల్య అధ్యక్షత వహించారు. మల్లేశ్వరి మాట్లాడుతూ ఐసీడీఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని ఆమె విమర్శించారు. యూనియన్ నిర్వ హించిన అనేక పోరాటాల ఫలితంగా వర్కర్లకు జీతాలు పెంచుతున్నామని ప్రకటన చేసినా ఇంతవరకు అమలు చేయలేదని ఆమె విమర్శించారు. 2017 నుంచి టీఏ బిల్లులు ఇవ్వలేదని, ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాడ్యుటీకి అర్హులని తెలియజేసిందన్నారు. కానీ అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయలేదని ఆమె విమర్శించారు. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచుతుందన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్.కె.సుజాత, ఎస్.అహల్య, కోశాధికారిగా ఎన్.జ్యోతిని ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో ఫిరంగిపురం ప్రాజెక్టు కార్యదర్శి ధనలక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ అంజలి, జ్యోతి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మల్లేశ్వరి

కదులుతున్న రైలు ఎక్కబోయి వృద్ధుడి దుర్మరణం

వినుకొండ టౌన్: కదులుతున్న రైలు ఎక్కుతు ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జి.ఆర్.పి ఎస్ఐ సుబ్బారావు కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పెద్ద రావిపాడు గ్రామానికి చెందిన తాతపూడి శాంసన్ (60) కదులుతున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడటంతో, కాళ్లకు బలమైన గాయాలయ్యాయన్నారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలోనున్న శాంసన్‌ను చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గం మధ్యంలో మృతి చెందాడన్నారు.

కార్యాలయ భవనాలను వెంటనే పూర్తిచేయాలి

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రసాద్, ఏఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కొత్తపుల్లారెడ్డిగూడెం, శిరిగిరిపాడు, మండాది, కండ్లకుంట, గంగలకుంట, శ్రీరాంపురం తండ గ్రామాల్లోని అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించే వారికి ఇప్పటి వరకు పూర్తిగా బిల్లులు చెల్లించటం జరిగిందని, మిగిలిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత వారిగా బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు. మండలంలోని అన్నీ కార్యాలయాలను పూర్తి చేయాలని కోరారు. శిరిగిరిపాడు సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, బూడిద వెంకటేశ్వర్లు, దేరంగుల యేగయ్య, శీలం సైదారెడ్డి, కాటంరాజు, పంచాయతీ కార్యదర్శులు వడితె మకట్‌లాల్, వెంకటేష్, మీసాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



భవననిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్, ఏఈ శ్రీనివాసరెడ్డి

గొర్రెల పెంపకందారుల అభివృద్ధికి కృషి

దుర్గి: రాష్ట్ర పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నట్టల నివారణ కార్యక్రమం, గొర్రెల, మేకల పెంపకందారులకు చాలా మేలని ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ అన్నారు. బుధవారం ముటుకూరు గ్రామంలో నిర్వహించిన నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువులకు, జీవాలకు ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. పశువైద్యాధికారి దిలీప్ మాట్లాడుతూ 2020 జీవాలకు మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పసుపులేటి వెంకటరామయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొల్లి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీపీ సాయి శంకర్

200 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

బొల్లాపల్లి: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రోటరీ క్లబ్, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యా ర్థినులకు 200 సైకిళ్లు బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ అసిస్ట్ గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో సేవా కార్యక్రమా లు చేపట్టడం హర్షణీయమని, గత ప్రభుత్వాల హయాంలో పూర్తికాని పనులను చేపట్టి అభివృద్ధికి నాంది పలికిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం హయాంలో స్వచ్ఛంద సంస్థలకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పని అంతగా లేదని, ప్రభుత్వమే నాడు-నేడులో పాఠశాలల బిల్డింగ్‌లు, అంగన్‌వాడీ కార్యాలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందు నాయక్, తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం

అచ్చంపేట: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే సంతృప్తి కలుగుతుందని ఏఈఎల్‌సీ మధ్యమ గుంటూరు సినెడ్ అధ్యక్షులు ఎస్ జోహాన్‌బాబు తెలిపారు. పెదపాలెంలో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి, నిరాశ్రయులైన కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. తమ సంస్థ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.6వేల నగదు, 25కిలోల బియ్యం , నిత్యావసరాలు, వంట పాత్రలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు పలు సేవా సంస్థలు ఆదుకునేందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నార్త్ ప్యారిస్ లూథరన్ చర్చి ట్రెజరర్ చిత్తరంజన్, నాగరాజు, పాస్టర్లు సూర్యప్రకాష్‌రావు, సుందర్‌రావు, జైభీమ్ భారత్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మాతంగి సుధాకర్, జడకమల్ కుమార్, మాలమహానాడు అధ్యక్షుడు ఆశీర్వాదం, కుచిపూడి జాన్‌బాబు, జిల్లెల్ల పాల్‌రాజ్, మాలే పద్మారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

నూతన బోరు ప్రారంభం



దుర్గి: దర్మవరం గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక రజక పేట వాసులు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డికి సూచించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి నూతన మంచినీటి బోరును ప్రారంభించారు. నూతన బోరు ఏర్పాటుతో మంచినీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్లకు నోటిఫికేషన్

మాచర్ల: మాచర్ల – గురజాల డిపో పరిధిలో ఉన్న పక్కా ఖాళీ స్థలాలను ఐదేళ్ల పాటు అద్దె ప్రాతిపదికన కేటాయించుటకు టెండర్లు పిలవటం జరిగిందని డీఎం పిచ్చయ్య తెలిపారు. మాచర్ల ఏపీఎస్ ఆర్టీసీ డిపో పరిధిలో సోడా, కూల్‌డ్రింక్స్, మాచర్లలో డార్మీటర్, గురజాలలో ఆఫీసు అకాంబిడేషన్, ఫాస్టు ఫుడ్స్, స్వీట్స్, బేకరి, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం లోపు టెండర్ ఫారాలను మాచర్ల డిపో కార్యాలయంలో అందజేయాలన్నారు. టెండరు ఫారం నర్సరావుపేట కార్యాలయంలో ఈ నెల 13న మధ్యాహ్నం 2గంటలలోపు స్వీకరించి, అదే రోజు టెండర్లను ఖరారు చేయటం జరుగుతుందన్నారు.

కన్నెగంటి సమాధిని సందర్శించిన మల్లేపల్లి

దుర్గి: స్వతంత్ర సమర యోధుడు పల్నాడు ప్రాంతానికి చెందిన కన్నెగంటి హనుమంతు సమాధిని తెలంగాణ రాష్ట్ర సీనియర్ జర్నలిస్టు నాగార్జున సాగర్ బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బుధవారం సందర్శించారు. ఆయనతోపాటు చరిత్రకారుడు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కన్నెగంటికి నివాళులు అర్పించిన లక్ష్మయ్య మాట్లాడుతూ కన్నెగంటి హనుమంతు ఆయన సహచరుల పోరాట చరిత్ర పై సమగ్ర పరిశోధన జరగాలన్నారు. ప్రాణం సైతం లెక్కచేకుండా బ్రిటీషు వారిని ఎదిరించిన త్యాగమూర్తి హనుమంతు జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు, మనవడు కన్నెగంటి కృష్ణ, కన్నెగంటి హనుమంతు, అనుచరుని అనువంశీకుడు రోశయ్య, మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి రొండా దశరథరామిరెడ్డి, చెన్నుపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా 'రేబీస్' టీకాలు

రెంటచింతల:వరల్డ్ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా గురువారం స్థానిక పశువైద్యశాలలో ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు పశువైద్యాధికారి బషీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెంపుడు కుక్కలు, కుందేళ్లకు, గుర్రాలకుఈ రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని ఆయన కోరారు.